సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకుని బోధించాలి

గంగాధరనెల్లూరు: సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకుని బోధించాలని డిప్యూటీ డీఈవో చంద్రశేఖర్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని నెల్లేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృత్తిలో శిక్షణ చాలా కీలకమని అన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం సుబ్బరత్నమ్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎం యుగంధర్ ఆచారి పాల్గొన్నారు.

వైద్య విద్యను చిదిమేయకండి




ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య విద్యను దూరం చేస్తోంది. కొత్తగా ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు మోకాలడ్డుతోంది. ఉన్న కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తోంది. దీనివల్ల వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు పలువురికి నష్టం కలుగుతోంది. నా చెల్లెలి కుమార్తె బైపీసీ చదువుతోంది. రానున్న రోజుల్లో వైద్య విద్యను అభ్యసించేలా చేయాలి. అయితే ప్రస్తుత పరిస్థితులు, కటాఫ్ మార్కులు చూస్తుంటే భయమేస్తోంది. పేద విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. – కె.జయచంద్ర, ముదిపల్లి



పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు



నా కుమార్తె ఇంటర్ బైపీసీ చదువుతోంది. మెడిసిన్ చదివించాలన్న ఆలోచన ఉంది. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడంతో మా అమ్మాయిలాంటి పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. ప్రభుత్వ కాలేజీల్లో తక్కువ ఫీజుతోనే వైద్య విద్యను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అదే ప్రైవేటుపరం చేస్తే విద్యార్థులపై ఫీజుల భారం పడుతుంది. పలువురు పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదముంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను త్వరగా పూర్తి చేసి ఎంబీబీఎస్ సీట్లు తెచ్చేలా చొరవ చూపాలి. – టీఎం మంజుల, కరకంతాపురం




బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ

- పథకాల అమలుకు కానరాని మార్గదర్శకాలు
- సూపర్ సిక్స్ కోసం ఎదురు చూస్తున్న జనం
- సూపర్‌సిక్స్... జిమ్మిక్కేనా

బాబు హామీలు అమలకు నోచుకోవు, నీటి మీద రాతలు కనిపించవన్నట్లు ఉంది ప్రస్తుత ప్రభుత్వం వ్యవహారం. 2014 ఎన్నికల్లో రాష్ట్రం విడిపోయి కష్ట కాలంలో ఉంటున్న రోజుల్లో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలంటే అనుభవం ఉన్న వ్యక్తి సీఎంగా ఉండాలని భావించారు. మేధావులు, విద్యావంతులు, ఓటర్లు చంద్రబాబు ఇచ్చిన హామీలతోపాటు నేను మారానంటూ చెప్పిన పచ్చి అబద్దాలను నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. అయితే చంద్రబాబు మేక వన్నె పులి అని ప్రజలు గ్రహించకపోవడంతో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు. అదే విధంగా 2024 ఎన్నికల్లో కూడా సూపర్‌సిక్స్ పేరుతో అమలుకు నోచుకోని హామీలను గుప్పించాడు. అధికారంలోకి రాగానే పథకాలను పక్కాగా అమలు చేస్తానని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరువాడా ప్రచారం చేశారు. మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఖాతాల్లో జమ చేస్తాం, యువతకు ప్రతి నెలా రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం, 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం, ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ.15 వేలు తల్లికి వందనం పేరుతో ఇస్తామంటూ హామీలు ఇచ్చారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం అన్నదాత సుఖీభవ పథకం అందిస్తామనే మేనిఫెస్టోతో భారీగా ప్రచారం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సెప్టెంబర్ 20వ తేదీ నాటికి వంద రోజులు పూర్తవుతున్నా సూపర్ సిక్స్ పథకాల ఊసే లేదు. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ప్రస్తుతం రైతాంగమంతా పంటల సాగు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. అయినా ఇంతవరకు వారికి సాయం ఇవ్వలేదు. ఇలా చెప్పిన ప్రతి పథకం ఇంత వరకూ అతీగతీలేదు. ఐదేళ్ల వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి పక్కాగా అమలు చేసింది. దీంతో ప్రజలు గత ప్రభుత్వంలా కచ్చితంగా హామీలన్నీ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. – కార్వేటినగరం

సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చండి



జి.డీ.నెల్లూరు మహిళలకు
ఉచిత బస్సు ప్రయాణం – 151136

నగరి మహిళలకు
ఉచిత బస్సు ప్రయాణం – 133146



ప్రతి ఇంటికి – 3 గ్యాస్ సిలిండర్లు
గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో
అర్హుల సంఖ్య – 63594

నగరి నియోజకవర్గంలో
అర్హుల సంఖ్య – 51473




ప్రతి మహిళకు నెలకు – రూ.1500
జీడీనెల్లూరు నియోజకవర్గంలో
అర్హులైన మహిళల సంఖ్య –39763
ఇవ్వాల్సిన సాయం – రూ.5.96 కోట్లు

నగరి నియోజకవర్గంలో
అర్హులైన మహిళల సంఖ్య – 42475
ఇవ్వాల్సిన సాయం – రూ.6.37 కోట్లు



యువతకు నెలకు –రూ.3 వేలు నిరుద్యోగ భృతి
జీ.డీ.నెల్లూరులో నియోజక వర్గంలో
అర్హులైన యువత – 11341
వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం –రూ.3.40 కోట్లు

నగరి నియోజక వర్గంలో
అర్హులైన యువత – 10920
వీరికి నెలకు ఇవ్వాల్సిన
సాయం – రూ.3.28 కోట్లు



వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా
జీడీనెల్లూరు నియోజక వర్గంలో 40.75 కోట్లు
టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి
రైతులకు అందాల్సిన సాయం 82.91 కోట్లు

వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా
నగరి నియోజక వర్గంలో 27.70 కోట్లు
టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి
రైతులకు అందాల్సిన సాయం 46.17 కోట్లు



అమ్మఒడి
జీడీనెల్లూరు 36.21 కోట్లు
తల్లికి వందనం
జీడీనెల్లూరు 49.45 కోట్లు

అమ్మఒడి
నగరి 30.18 కోట్లు
తల్లికి వందనం
నగరి 41.21 కోట్లు

మూడు సిలిండర్లు లేనట్టేనా...



ఎన్నికల గెలుపు కోసం ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ప్రభుత్వం ఇప్పుడు వెనుకడుగు వేయడం తెలిసిన విషయమే. సూపర్ సిక్స్‌కు సంబంధిత మార్గదర్శకాలు కూడా ఇప్పటి వరకు రాలేదు. వంద రోజుల గడిచిపోయింది. ఇది ఆంధ్ర ప్రజలను మోసం చేసినట్టే. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తప్పనిసరిగా నెరవేర్చాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని వారు పరిపాలించడానికి అర్హులు కాదు.
– గోవర్ధన్, గుండ్రాజుకుప్పం దళితవాడ, నగరి మండలం

పంట సాగుకు పెట్టుబడి ఇవ్వరా..



ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభమైంది. పంటలు సాగు చేసుకోవాలి. వర్షాలు కూడా పడుతున్నాయి. గతంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్నప్పుడు ఈ పాటికి రైతు భరోసా ఇచ్చారు. ప్రతి ఏటా చెప్పిన సమయానికి ఇచ్చి రైతులను ఆదుకున్నారు. టీడీపీ నేతలు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామన్నారు. ఇంకా అందలేదు. త్వరగా అందించి రైతులకు సహకారం అందించాలి.
– వీరయ్య, రైతు, చవరంబాకం, నింద్ర మండలం.

నిరుద్యోగ భృతి ఏమైంది



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీలలో నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారంలో వచ్చి వంద రోజులైనా దానికి మార్గదర్శకాలు కూడా విడుదల కాలేదు. నిరుద్యోగులకు భృతి ప్రకటించలేదు. త్వరగా ఆచరణలోకి తెచ్చి నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేలు అందించాలి. వారికి ఆదరణగా నిలవాలి.
– కైలాసం, నిరుద్యోగి, నింద్ర మండలం

తల్లికి వందనం జాప్యమవుతోంది



నాకు ఇద్దరు పిల్లలు పెద్ద కుమారుడు ఆర్.చరణ్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రెండో కుమారుడు ఆర్.కిషోర్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పింది. ఎంత మంది పిల్లలున్నా వారందరికీ తల్లికి వందనం ఇస్తామని ప్రకటించింది. గత ఏడాది జూన్ నెలలోనే వచ్చేసింది. కొత్త జీఓకు, మార్గదర్శకాలు రావడానికే చాలా జాప్యం అవుతోంది. డబ్బులు వస్తే పిల్లల విద్యాభివృద్ధికి ఎంతో మేలు చేకూరుతుంది.
– ఆర్.భారతి, ముదిపల్లి, నగరి మండలం

ఉచిత బస్సు ప్రయాణం ఎన్నడో...



ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పింది. అయితే ఇప్పటివరకు ఆ ఊసే లేదు. పక్క రాష్ట్రం తెలంగాణలో వెంటనే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశారు. ముఖ్యమంత్రి రాజకీయ చరిత్ర చూసుకుంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏదీ ఇంతవరకు నెరవేర్చలేదు. అలాగే ప్రస్తుతం ఇచ్చిన హామీలను కూడా గాలికి వదిలేశారు. చేయలేని హామీలు ఎందుకు ఇవ్వాలి.
– సరళ, ఇల్లత్తూరు, విజయపురం మండలం

మహిళలకు రూ.1500 ఇవ్వరా?



ఎన్నికల సమయంలో ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని ప్రచారం చేశారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు. తీరా అందలం ఎక్కాక హామీల ఊసే లేకుండా పోయింది. సూపర్‌సిక్స్ అంటేనే భయమేస్తోందని ముఖ్యమంత్రి చెప్పడం చూస్తుంటే హామీలు అమలుపై సందేహాలు తలెత్తుతోంది. హామీలు ఇచ్చి మర్చిపోతే ఎలా.. పలువురు రూ.1500 ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నారు.
– కె. శోభారాణి, ఆర్టీసీ కాలనీ, పుత్తూరు

క్లుప్తంగా

అన్ని అంశాల్లో సంసిద్ధంగా ఉండాలి

నగరి: పాఠశాలలు అన్ని అంశాల్లో సంసిద్ధంగా ఉండాలని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయ తెలిపారు. బుధవారం మున్సిపల్ పరిధి పుదుపేట ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాల సంసిద్ధతపైనే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఆధారపడి ఉన్నాయని ఉపాధ్యాయులకు సూచించారు. టీచర్స్ రిసోర్స్ బుక్, లెసన్ ప్లాన్ తయారీ, స్క్రిప్ట్ చాట్ యాప్, ఏపీ టీచర్స్ బాట్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వరుసగా పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, పుదుపేట ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే సబ్జెక్టుకు సంబంధించి తెలుగు, హిందీ, పీడీ సమావేశాలు ఏకాంబరకుప్పం, నాగరాజు కుప్పం, ఎం.కొత్తూరు పాఠశాలలో నిర్వహించామన్నారు.

అనుమతి లేని అక్రమ క్వారీలు



నరసింహాపురం సమీపంలో అక్రమ క్వారీ

పాలసముద్రం: మండల పరిధిలో అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీల నుంచి రాత్రి సమయంలో రాళ్లను తమిళనాడుకి తరలించేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. దీన్ని గమనించిన టీడీపీ నాయకులు క్వారీ యజమానులను బెదిరించి లక్షల రూపాయలు దోచుకుంటున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు క్వారీలు, ఇసుక అక్రమ రవాణాపై పడ్డారు. మండలంలో టీడీపీకి చెందిన బుల్లెట్ బ్యాచ్ దందాలు ఎక్కువయ్యాయి. ట్రాక్టర్లలో ఇసుక తమిళనాడు సరిహద్దుల్లోకి డంప్ చేసి, రాత్రికి రాత్రే తరలించేస్తున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు బుల్లెట్ బ్యాచ్ ఆగడాలను అరికట్టాల్సి ఉంది.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం





శ్రీహరిపురంలో పౌష్టికాహారం అందిస్తున్న సూపర్‌వైజర్, అవగాహన కార్యక్రమంలో సీడీపీఓ

విజయపురం: పౌష్టికాహారంతో పిల్లలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి అన్నారు. బుధవారం శ్రీహరిపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అలాగే పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం సీమంతాలు చేసి, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత, హైమనందిని, విజయ, చెంచుమోహన, అనిత, విజయ, గంగోత్రి, గర్భిణులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవం

నింద్ర: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార మాసోత్సవం పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. కొత్త ఆరూరులో జరిగిన కార్యక్రమంలో నగరి సీడీపీఓ కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లీబిడ్డకు పౌష్టికాహారం చాలా ముఖ్యమని అన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తమ పిల్లలకు అందించాలన్నారు. చిన్నతనం నుండి రక్త హీనత లేకుండా చూడాలని సూపర్‌వైజర్ శ్యామల అన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు అందించే ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వసుమతి, కార్యకర్తలు, పిల్లలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించరు.. అధికారులు పట్టించుకోరు



కోసలనగరం సచివాలయ కార్యాలయం

విజయపురం: మండలంలోని సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 12 సచివాలయం, 107 మంది సిబ్బంది ఉన్నారు. అయితే ఓ ఒక్కరు సచివాలయానికి సరైన సమయానికి రావడం లేదు. దీంతో వివిధ పనులు విషయమై సచివాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలు ఎప్పుడు వస్తారు... ఎప్పుడు పోతారో కూడా తెలియడం లేదని, ఇంటికి, సచివాలయానికి తిరగవల్సి వస్తుందని వాపోతున్నారు.

అక్కడ ఉన్నాం...లేదు ఇక్కడ ఉన్నాం

'ఎక్కడ ఉన్నారు సార్...నేను పనిపై బయట ఉన్నాను. ఎప్పుడు వస్తారు సార్..చెప్పలేం..మీకు ఏమి కావాలి చెప్పు... ఏదైనా ఉంటే రేపటికి రా' తరుచూ సచివాలయ సిబ్బంది నుంచి వినబడే మాటలు ఇది. అయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చింది. అయితే ఏ ఒక్క సిబ్బంది సచివాలయంలో ఉండడం లేదని స్థానిక ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. అధికారులు స చివాలయ సిబ్బందిపై దృష్టి పెట్టి ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

పొదుపు నగదు పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: మండల పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో పొదుపు సక్రమంగా కట్టుకుని నగదు పెంచుకోవాలని ఐకేపీ ఏపీఎం పరిదుమస్తాన్ తెలిపారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో సీసీ, సంఘమిత్రలు, వీఓ లీడర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ, అంతర్గత ఆడిట్ బహిర్గత ఆడిట్ పాలసీలు, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ వారు ఇచ్చిన సూచనలు అమలుపరచాలన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు సక్రమంగా కంతుల ప్రకారం కట్టించాల్సిన బాధ్యత సంబంధిత సంఘమిత్ర, లీడర్లపై ఉందని తెలిపారు. స్త్రీనిధి, ఉన్నతి రికవరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల, లీడర్లు పాల్గొన్నారు.

గ్రావెల్ లారీకి రూ.25 వేలు జరిమానా

నగరి: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీకి తహసీల్దార్ రవికుమార్ రూ.25వేలు జరిమానా విధించారు. బుధవారం నాగరాజకుప్పం గ్రావెల్ క్వారీ వద్ద ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఆయన అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీకి తొలి హెచ్చరిక కింద రూ.25 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి ఈ లారీని పట్టుకుంటే రెండో హెచ్చరిక కింద రూ.50 వేలు జరిమానా విధిస్తామని ఆపైబడి పట్టుకుంటే సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

వృద్ధులకు అన్నదానం

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం అన్నదానం చేపట్టారు. శ్రీరంగరాజపురం మండలం మూలూరు గ్రామానికి చెందిన నరసింహమండడి తన భార్య లక్ష్మమ్మ మొదటి వర్థంతి సందర్భంగా ఈ కార్యక్రమ చేపట్టారు. పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు గురునాథం, విజయ, అమరావతి, సురేష్‌బాబు, శ్రీనివాసులు, రాస్ కో–ఆర్డినేటర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థికి సత్కారం



సిద్ధిక్‌ను సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు

నగరి: కాకినాడ జిల్లా అన్నవరంలో నిర్వహించిన అంతర్‌జిల్లాల 9వ సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టులోని కె.సిద్దిక్‌ను బుధవారం అభినందించారు. అతను విద్యనభ్యసించే లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌కు చెందిన కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్దిక్‌ను దుశ్శాలువాలతో సన్మానించి, మరిన్ని పతకాలు సాధించాలని కోరారు.

సేంద్రియ సాగుకు ప్రాధాన్యమివ్వాలి



సేంద్రియ పంటలను పరిశీలిస్తున్న ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు

పాలసముద్రం: మండల పరిధిలోని రైతులు సేంద్రియ ఎరువుల వాడకానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని చిత్తూరు ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. బుధవారం ఎస్‌కేఆర్ పురం పంచాయతీల్లో సేంద్రియ వ్యవసాయంలో సాగు చేస్తున్న పంటలను ఆయన క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు మాట్లాడుతూ సేంద్రియ సాగులో రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. తక్కువ పెట్టుబడితో నికరాదాయం, నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. రసాయన ఎరువుల రేట్లు రోజురోజుకూ పెరిగిపోతుండడమే కాక, ఉత్పత్తులు విషతుల్యమైపోతున్నాయని తెలిపారు. విత్తన శుద్ధికి జీవామృతం, సస్యరక్షణకు గోవు పేడ, మూత్రంతో చేసిన కషాయం వినియోగించవచ్చన్నారు. సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పొలంబడులు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రసాయనిక మందుల వాడకం తగ్గించడం తదితర విషయాలపై తరవుగా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, అనంతరం సేంద్రియ సాగుపై సాగు చేసిన సూర్య మండల పద్ధతిలో సాగు చేసిన కూరగాయల పంటలను క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు.

భారీగా మోటార్ కేబుల్స్ చోరీ

గంగాధరనెల్లూరు: మండలంలోని ముక్కలతూరు పంచాయతీ పరిధిలో దాదాపు 5 కిలోమీటర్ల మేర 30 మంది రైతులకు చెందిన బోరు మోటార్ల కేబుల్‌ను గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి చోరీ జరిగిందని బాధితులు వాపోయారు. ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు కేబుల్స్ చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరులో పిల్లలకు ఆహారం పంపిణీ

పుత్తూరు: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచివుండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మాజీ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని గత ఆరేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు యథావిధిగా విజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కూరలు, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.